సాక్షి
బాపట్ల

ఆదివారం । 23 । జూలై । 2023



ఎనిమిది కేసులు పరిష్కారం

నరసరావుపేటటౌన్: ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఎనిమిది కేసులు పరిష్కారం కాగా రూ.57.53 లక్షలు పరిహారం కింద లభించిందని న్యాయమూర్తి ఓ.వి.నాగేశ్వరరావు తెలిపారు.



వృద్ధులకు న్యాయం అందిస్తాం

మంగళగిరి: వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వృద్ధులకు సమస్యలను ఉచితంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ నాగరాజా అన్నారు.



డాక్టర్ గీతాదేవికి బంగారు పతకం

తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జరిగిన వైద్యుల సమావేశంలో స్త్రీల వైద్యురాలు గీతాదేవికి డాక్టర్ విజయలక్ష్మి బంగారు పతకాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

ఘనంగా ఆండాళ్ తిరునక్షత్ర మహోత్సవం




తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శనివారం ఆండాళ్ తిరునక్షత్ర మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో అహోబిల రామానుజస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో మహోత్సవాలను నిర్వహించామని తెలిపారు. ఉదయం 9 గంటలకు అభిషేకం, చాతుర్మాస్య దీక్ష 20వ రోజున సీతారాముల నిత్య కల్యాణం, ఆండాళ్ అమ్మవారికి తులసితో అష్టోత్తర శతనామార్చన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అనంతరం తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమం ఘనంగా జరిగిందని అన్నారు. అయోధ్య రామజన్మభూమి న్యాస్ సభ్యులు శ్రీమాన్ రామ్‌విలాస్ వేదాంతి ఆండాళ్ అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, వేద విద్యాలయ విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం




విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 517 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 5,088, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 5,988 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.80 అడుగుల వద్ద ఉంది.

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్‌ల పరిశీలన



గుంటూరుమెడికల్: డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను వైద్యాధికారుల బృందం శనివారం తనిఖీ చేసింది. ప్రభుత్వం అందజేసిన 70 రకాల వైద్య పరికరాలు ఏవిధంగా ఉన్నాయో పరిశీలించారు. అందులో భాగంగా గుంటూరు జిల్లాకు నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ జవ్వాది విజయలక్ష్మి విచ్చేశారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలోని మెడికల్ స్టోర్స్‌లో జిల్లాకు కేటాయించిన వైద్య పరికరాలను సకాలంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు పంపిణీ చేశారా లేదా అనే విషయాలను రికార్డులు చూసి, ఫిజికల్‌గా పరిశీలించి తెలుసుకున్నారు. అన్ని వైద్య పరికరాలు ఆయా క్లినిక్‌లకు పంపించడంతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సదరు వైద్య పరికరాలు ఉన్నాయా లేదా అని పరిశీలించేందుకు జొన్నలగడ్డ, రావెల, వరగాని సెంటర్‌లకు వెళ్లారు. అక్కడ వైద్య పరికరాలు అందుబాటులో ఉండటంతో మందుల పంపిణీ ఏవిధంగా ఉందనే విషయంపై ఆరా తీశారు. డాక్టర్ విజయలక్ష్మి వెంట ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నోడల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గిరిధర్, సైమన్ ఉన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,000, గరిష్ట ధర రూ.2,200, మోడల్ ధర రూ.1,400 వరకు పలికింది.

మొక్కవోని దీక్షతో..

ఇక గ్రీన్ బాపట్ల
- జగనన్న పచ్చతోరణం
- 28న జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం
- ఒకే రోజు రెండు లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక
- అన్ని శాఖల సమన్వయంతో ముందుకు
- 33 శాతానికి పచ్చదనం పెంచడమే లక్ష్యం

తీరం పచ్చదనంతో పులకించనుంది.. ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచనుంది.. సుదూర తీర ప్రాంతం ఉన్నా.. పర్యావరణ వృద్ధికి అవకాశం ఉన్నా.. వనరుల ఊరిస్తున్నా .. జీడిమామిడి తోటలతో కళకళలాడుతున్న భూమి.. గత పాలకుల నిర్లక్ష్యంతో పర్యావరణ ముప్పు ముంచుకొస్తోంది.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించారు.. వర్షరాగం అలలు అలలుగా పొలిమేరలు దాటి.. ఊరి వాడలన్నింటినీ తాకి తన్మయం చేస్తున్న వేళ.. పుడమితల్లి పులకించేలా జిల్లాలో జగనన్న పచ్చతోరణానికి ఈనెల 28న ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.



వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం నర్సరీలో సిద్ధం చేసిన మొక్కలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లా పర్యావరణహితంగా మారనుంది. అందుకు తగిన విధంగా కలెక్టర్ రంజిత్‌బాషా ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు ప్రసిద్ధి చెందిన గ్రానైట్ రాయికి నిలయం. ఇక్కడి నుంచి పలు దేశాలకు గ్రానైట్ ఎగుమతి అవుతోంది. ఇక బాపట్ల ఆది నుంచి వ్యవసాయరంగానికి వెన్నుదన్నుగా ఉంది. ఇక్కడ వరి, జీడి మామిడి పరిశోధనా కేంద్రాలు పలురకాల కొత్త వంగడాలను సృష్టించి దేశవ్యాప్తంగా రైతులకు అందిస్తున్నాయి. రేపల్లె, బాపట్ల, చీరాల ప్రాంతాలు తీరం వెంబడే ఉంటాయి. దీంతో రోజురోజుకూ పర్యాటక రంగం అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో జిల్లాను సుందరంగా తీర్చిదిద్దడంలో భాగంగా గ్రీనరీని పెంచేందుకు రెండు లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ప్రణాళిక సిద్ధం చేశారు.

ప్రస్తుత పర్యావరణ పరిస్థితి..

ప్రస్తుత పర్యావరణం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా పచ్చదనం 33 శాతం మేర ఉండాలి. కాని 26 నుంచి 27 శాతం మధ్యలోనే ఉంది. దీనిని 33 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనుంది.

వెదుళ్లపల్లి నుంచి..

వెదుళ్లపల్లిలోని ఆరోగ్య కేంద్రంలో జగనన్న పచ్చతోరణం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మొక్కలు నాటి ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే రోజున మొక్కలు నాటనున్నారు. రెవెన్యూ, డ్వామా, వ్యవసాయ, ఉద్యానవన , అటవీశాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో చేపట్టనున్నారు.

అందరి భాగస్వామ్యంతో..

జగనన్న పచ్చతోరణం కార్యక్రమానికి గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, డ్వాక్రా గ్రూపులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ఎన్‌జీఓలు, అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయనున్నారు.

నర్సరీలు ఎక్కడ ఉన్నాయంటే..

చినగంజాం, వేటపాలెం, చీరాల, కొరిశపాడు ప్రాంతాల్లో డ్వామా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలు ఉన్నాయి. వీటి ద్వారా రెండు లక్షల మొక్కలు సిద్ధం చేసి ఊరు– వాడా నాటనున్నారు.

నాటునున్న మొక్కలు..

వేప, చింత, నేరేడు, మోదుగ, నల్లమద్ది, సుంకేసుల, కానుగ, గంగరావి, రావి, రేలా రకాలు ఉన్నాయి.

గ్రీన్ బాపట్ల జిల్లాగా మారుస్తున్నాం



అన్నిరంగాల్లో బాపట్ల జిల్లా అభివృద్ధి చెందుతోంది. ప్రధానంగా వ్యవసాయం, గ్రానైట్, పర్యాటకంగా రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం సంపాదించింది. తీర ప్రాంతం కావడంతో పర్యాటకులు పక్క రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో పచ్చదనం మరింతగా పెంచి గ్రీన్ బాపట్లగా మార్చాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. అందుకోసమే జగనన్న పచ్చతోరణం నాడు ఒకే రోజు రెండు లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నాం.

– రంజిత్‌బాషా, జిల్లా కలెక్టర్, బాపట్ల

సరదాగా వెళ్లి.. మృత్యు ఒడికి చేరి ..

- కోనంకి వద్ద రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు
- గాయపడి కళ్లు పోగొట్టుకున్న అనిల్
- కుటుంబాల్లో పెనువిషాదం



క్షతగాత్రుడు అనిల్



శివశంకర్(ఫైల్)



వి.వెంకటరావు(ఫైల్)



ఎస్.రామకృష్ణ(ఫైల్)

మార్టూరు: వారంతా స్నేహితులు. చిరుజల్లుల్లో సరదాగా కారులో షి‘కారు’కెళ్దామని బయలుదేరారు. సమీపంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్దకు నలుగురు వెళ్లారు. అక్కడ కొద్దిసేపు ఎంతో ఆనందంగా గడిపారు. తిరుగు బాటలో మృత్యు ట్యాంకర్ పొంచిఉందని పసిగట్టలేకపోయారు. శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. యువకుడి అనిల్ రెండు కళ్లు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన కొనంకిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న విషయం విదితమే.

ద్వారకపాడు గ్రామానికి చెందిన 37 సంవత్సరాల వెలగా అనిల్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా ఇంటి వద్దే ఉంటూ వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. భార్య సుభాషిణి, 11 ఏళ్ల కుమారుడు ఉన్నారు. తన కారు డ్రైవ్ చేస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అనిల్‌కు రెండు కళ్లు తొలగించడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

రామకృష్ణ.. కళ్లు అనిల్‌కు..

రోడ్డు ప్రమాదంలో రెండు కళ్లు కోల్పోయిన అనిల్ కుటుంబ సభ్యులు అభ్యర్థన మేరకు ఇదే ప్రమాదంలో మృతి చెందిన రామకృష్ణ కుటుంబ సభ్యులు నేత్ర దానం కోసం అంగీకరించారు. అధికారుల అనుమతితో గుంటూరు శంకర కంటి ఆస్పత్రి వైద్య బృందం శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంకొల్లు రోటరీ క్లబ్ సహకారంతో రామకృష్ణ రెండు కళ్లను వైద్యులు తీసి, భద్రపరచి ఆస్పత్రికి తరలించారు. ఆయా కుటుంబాల్లో పెనువిషాదం నింపింది.

ఒక్కడే కొడుకు..

మండలంలోని రాజుపాలేనికి చెందిన నల్లపునేని హరిబాబు, రమాదేవి ఏకైక సంతానం రామకృష్ణ(37). గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ప్రమాదంలో మృతి చెందడం, కొడుకు అంత్యక్రియలు చేయాల్సి రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

విజయవాడకు చెందిన కొండపల్లి శివశంకర్(42) డేగరమూడి గ్రామానికి చెందిన యువతిని వివాహం చేసుకొని 20 ఏళ్ల నుంచి గ్రామంలోనే ఉంటున్నాడు. మృతుడికి ఇంజినీరింగ్, ఇంటర్ చదివే ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయంతో పాటు చిన్న పాటి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే శివశంకర్, మృతితో కుటుంబ పరిస్థితి వీధిన పడినట్లు అయిందని బంధువులు వాపోతున్నారు.

- కోనంకి గ్రామానికి చెందిన వెంకటరావు(62) సన్నకారు రైతు. కుమార్తె, కుమారుడికి వివాహాలు జరిపించారు. రోడ్డు ప్రమాదంలో దుర్మరణానికి గురవడం గ్రామస్తులను కలచి వేసింది. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న అనిల్ ఇతడి మేనల్లుడు.

రైతులకు అన్ని రకాలుగా మేలు



వ్యవసాయశాఖ రూపొందించిన బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, చైర్మన్ మంతెన దశరథమహారాజు తదితరులు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: రైతులకు అన్ని రకాలుగా మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా తెలిపారు. జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం రూపొందించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్‌కు సాగునీరు విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిల్లాలో లక్ష 53 వేల 136 ఎకరాలలో 26 రకాల పంటలను సాగు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 6 వేల 779 ఎకరాల్లో పంటలు వేశారన్నారు. రైతులు పండిస్తున్న పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, బీమా వర్తింపజేయాలని అధికారులకు సూచించారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద 13 వేల 589 మందికి ఈకేవైసీ చేయించకపోవడంపై అధికారులను నిలదీశారు. రైతుల పేర్ల నమోదులో సాంకేతిక సమస్యలు, పొరపాట్లు వస్తే స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కౌలు రైతులలో సి.సి.ఆర్.సి. కార్డులు పొందిన వారికి పంట రుణాలు అందిస్తామని తెలిపారు. చివరి భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రైతులు పండించిన శనగపంటను కొనుగోలు చేస్తామని చెప్పారు.

ఎరువుల కొరత లేదు..

జిల్లాకు 61 వేల 766 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధం చేశామని కలెక్టర్ వివరించారు. 35 వేల 436 మెట్రిక్ టన్నుల పురుగుమందులను సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాలలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు అందుబాటులో ఉన్నయని చెప్పారు. బాపట్ల ప్రాంతంలో పూల తోటలు సాగు భూములలో ఉప్పుశాతం అధికంగా ఉన్నందున పంటలు దెబ్బతింటున్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నట్లు వివరించారు.

సాగు నీరందించాలి..

జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మంతెన దశరథమహారాజు మాట్లాడుతూ పంటల సాగు చేసుకుంటున్న రైతులకు సాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాలు దృష్ట్యా పంట కాలువల మరమ్మతులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. పొలంగట్లపై శనగపంట వేసేలా రైతులను చైతన్య పరచాలని చెప్పారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి షేక్ అబ్దుల్ సత్తార్, ఉద్యాన శాఖ అధికారి జెన్నెమ్మ, పశుసంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు, ఎల్‌డీఎం శివకృష్ణ, నాబార్డు డీడీఎం శరత్ పాల్గొన్నారు.

సాధనతోనే ఉన్నత శిఖరాలు..

బాపట్ల: సాధనతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని జిల్లా కలెక్టరు పి.రంజితా బాషా అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు శ్రీ భావపూరి విద్యాసంస్థలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్స్‌ను ఉచితంగా జిల్లా కలెక్టరు శనివారం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, ప్రభుత్వ సహకారంతో శ్రీ భావపూరి విద్యాసంస్థ నిరుద్యోగులకు మంచి శిక్షణ అందిస్తుందని తెలిపారు. విద్యాసంస్థ ప్రధానాచార్యులు ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సి.ఇ.డి.ఎం సెంట్రల్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ భారత ప్రభుత్వ సౌజన్యంతో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈనెల 31వ తేదీ నుంచి రెండో బ్యాచ్ ప్రారంభమవుతుందని చెప్పారు.

ఆ.. కథనాలు అవాస్తవం

- మిల్లర్ల సమస్యలు పరిష్కరించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే
- ముడుపులు, వసూళ్లు వంటివి లేనే లేవు
- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మిశెట్టి బాబు


సమావేశంలో మాట్లాడుతున్న బొమ్మిశెట్టి బాబు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

బాపట్ల అర్బన్: రైస్ మిల్లర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలు అవాస్తవమని బాపట్ల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మిశెట్టి వెంకటరత్న గుప్తా(బాబు) పేర్కొన్నారు. బాపట్ల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బొమ్మిశెట్టి బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం నుంచి రైస్ మిల్లర్లకు బకాయిలు కొనసాగుతున్నాయని చెప్పారు. రైస్ మిల్లుల సామర్థ్యాన్ని 75 హెచ్‌పీ నుంచి 100 హెచ్‌పీకి పెంచుతూ దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వెసులు బాటు కల్పిస్తే, ఓదార్పుయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 150 హెచ్‌పీకి పెంచుతూ ఎల్‌టీ కేటగిరీ కింద అమలు చేయటం మిల్లర్లకు ఎంతో మేలు చేసిందని వివరించారు. పేదలకు నాణ్యమైన బియ్యం ఇవ్వాలనే ప్రభుత్వ ఆలోచనకు మిల్లర్లంతా సంపూర్ణ మద్దతు ఇచ్చి, నూతన పాలసీ ప్రకారమే ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. ఆంధ్రజ్యోతి కథనాలు ద్వారా రాజకీయాల్లోకి మిల్లర్ల సమస్యలని లాగి, తమ ఐక్యతను, ప్రభుత్వంతో కలిగి ఉన్న సంబంధాలను దెబ్బతీయాలని చూస్తున్నట్లుందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వంపై బురద జల్లటానికి 'మిల్లర్లను - మిల్లర్ల సమస్యలను' వాడుకోవద్దని ఆంధ్రజ్యోతికి హితవు పలికారు. సమావేశంలో బాపట్ల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తటవర్తి గురుబ్రహ్మం, నీరుకట్టు నరసింహారావు, దేవకి సుబ్రహ్మణ్యం, నేరెళ్ల కాశి, సంయుక్త కార్యదర్శులు గెల్లి ప్రసాద్, కంచర్ల వెంకట శివప్రసాద్, జిల్లా న్యాయ సలహాదారు తటవర్తి శిరీష, జిల్లా సభ్యులు పీవీ రంగారావు, గాదంశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



మేదరమెట్ల: గంజాయి క్రయవిక్రయాలకు పాల్పడినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలోని కొరిశపాడు పోలీసు స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. ఎస్పీ జిందాల్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని కేసులను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. జాతీయ రహదారిపై ఎక్కడెక్కడ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయో గమనించి అలాంటి ప్రదేశాల్లో ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. సచివాలయ పరిధిలో ఉండే మహిళా పోలీసులు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని కోరారు. గంజాయి, బెల్టుషాపులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, పేకాట వంటి కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గంజాయి కేసుల్లో ఇప్పటి వరకు జిల్లాలో సర్కిల్ పరిధిలో 154 మందిపై కేసులు పెట్టి నిందితులను అరెస్టు చేశామన్నారు. అనంతరం కేసుల పురోగతిపై సిబ్బందితో చర్చించారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పలు కేసులను ఛేదించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. ఎస్పీ వెంట చీరాల డీఎస్పీ ఎస్.ప్రసాద్, రూరల్ సీఐ యూ.ఉమేష్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ జీవీ చౌదరి, సీసీ హరికృష్ణ పాల్గొన్నారు.

నిర్ణీత వేగంతోనే వాహనాలు నడపాలి

బాపట్ల టౌన్: నిర్ణీత వేగంతోనే వాహనాలు నడపాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ కోరారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహనలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నో యాక్సిడెంట్ డే శనివారం నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాటిని యాక్సిడెంట్ ప్రోన్, బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించడం జరిగిందని చెప్పారు. వాహనాల వేగాన్ని నిరోధించడానికి, ఇసుకతో నింపిన డ్రమ్స్ ఏర్పాటు చేసి వాటికి రేడియం స్టిక్కర్స్ అతికించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాల గురించి, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, రోడ్డు భద్రత నియమాలు పాటించని వాహనదారులకు చలానాలు విధించాలని సిబ్బందిని ఆదేశించారు.

సెయింటాన్స్‌కు నేషనల్ అక్రిడిటేషన్ గుర్తింపు


అక్రిడిటేషన్ ఉత్తర్వులతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్‌ను మరో మూడేళ్ల పాటు పొడిగించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణరావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు సంయుక్త ప్రకటనలో శనివారం తెలిపారు. కళాశాలకు న్యూఢిల్లీ నుంచి ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గుర్తింపుతో పాటు కాకినాడ జేఎన్‌టీయూ యూనివర్సిటీ ద్వారా శాశ్వత గుర్తింపు పొందినట్లు తెలిపారు. నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ మూడుసార్లు గుర్తింపు, నాక్ రెండుసార్లు ఏ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు చెప్పారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌చే 2(ఎఫ్), 12(బీ) గుర్తింపుతో పాటు అటానమస్ కళాశాలగా గుర్తింపు పొందిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏ గ్రేడ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్ ద్వారా శాశ్వత గుర్తింపు, టమ్స్ ఆఫ్ ఇండియా, సీఈజీఆర్ సంస్థల సర్వే ద్వారా దేశంలో ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఒకటిగా గుర్తింపు పొందినట్లు చెప్పారు. రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అత్యున్నత ప్రమాణాలతో రూ.2.5 కోట్ల విలువతో ఆరు కంప్యూటర్ లేబొరేటరీలతో 550 కంప్యూటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలరావు, సీఎస్‌ఈ విభాగాధిపతి హరిణి, ఈసీఈ విభాగాధిపతి కే జగదీష్‌బాబు ఉన్నారు.

ప్రతిభామూర్తులను స్మరించుకోవాలి


ప్రతిభామూర్తుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

అద్దంకి రూరల్: ప్రతిభామూర్తులను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అన్నారు. స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చయ్య సేవా సదన్‌లో అద్దంకి డిపో ఆర్టీసీ రిటైర్డ్ సంఘం ఆధ్వర్యంలో భీమనాథ హనుమారెడ్డి స్మారక వేదికపై ప్రతిభామూర్తుల సభ శనివారం రాత్రి నిర్వహించారు. మహాకవి గుర్రం జాషువా, నంది పురస్కార గ్రహీత పిన్ని వెంకటేశ్వర్లు, ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను వివరించారు. కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య), సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, ఆర్‌వీ రాఘవరావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, మన్నం త్రిమూర్తులు, జీ శేషగిరి, రోటరీక్లబ్ బాధ్యుడు చప్పిడి వీరయ్య, కొల్లా భువనేశ్వరి, ఎం.రామదాసు, అద్దంకి లేవీ ప్రసాద్, వీవీ బ్రహ్మం పాల్గొన్నారు.

వైద్యశాలల్లో కేంద్ర బృందం పరిశీలన

నివేదికలు కేంద్ర వైద్యశాఖకు అందజేస్తామని వెల్లడి


డీఎంహెచ్ఓ శోభారాణితో సమావేశమైన కేంద్ర వైద్యుల బృందం

నరసరావుపేట: మినిస్ట్రీ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్‌కు చెందిన ఇద్దరు డాక్టర్లు కేఆర్ అనితకుమారి, డీఎస్ సబితదాస్‌లతో కూడిన కేంద్ర బృందం పల్నాడు జిల్లాలో నాలుగు రోజులుగా పర్యటిస్తోంది. ఈ బృంద సభ్యులు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణితో కలసి వివిధ ప్రాంతాల్లోని ఆరోగ్యశాఖ కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో అమలవుతున్న అన్నీ రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు వివిధరకాల పథకాలను బృందం పరిశీలించింది. జిల్లా కేంద్రమైన నరసరావుపేట లింగుంటలోని ఏరియా ఆస్పత్రి సందర్శించి మాతా, శిశు సంరక్షణ సర్వీసులు, రక్తపరీక్ష, రక్త పరీక్షల సర్వీసులు, బ్లడ్ బ్యాంక్ నిర్వహణ, ఓపీ విభాగాలను పరిశీలించి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నీ రకాల పథకాలు నిర్వహణ గురించి ఆరా తీసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాలైన అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సందర్శించి అక్కడ అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం గిడుగు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించి అక్కడ అన్నీ రకాల సేవలకు చెందిన రికార్డులను పరిశీలించారు. కోటప్పకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దొండపాడు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించి అక్కడ ప్రజలకు సేవలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. చిలకలూరిపేటలోని అంబేడ్కర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడి ప్రజలకు అందుతున్న అన్నీ రకాల వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం పరిశీలించి అమలవుతున్న తీరును ప్రశంసించారు. అలాగే జేఎస్‌వై, జేఎస్ఎస్‌కే, పీఎంఎస్‌వై, 108, 104 సర్వీసులు అమలు అవుతున్న విధానాన్ని నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా మలేరియా ఆఫీస్‌ను సందర్శించి అక్కడా రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. శనివారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారిని కలిసి సంబంధిత రిపోర్టును కేంద్ర వైద్యశాఖకు అందజేస్తామని వారు వెల్లడించారు.